నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com

సదస్సుకు హైదరాబాద్‌కు వికలాంగులు



రేపు జైపూర్‌కు సీఎం రేవంత్ రాక?

- ఎస్‌టీపీపీలో అదనంగా 800మెగా వాట్ల యూనిట్ పనులకు శ్రీకారం

జైపూర్ : మంచిర్యాల జిల్లా జైపూర్‌కు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలిసింది. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో నూతనంగా నిర్మించనున్న 3వ యూనిట్ పనులను ప్రారంభించనున్నారు. ఇది వరకు పవర్ ప్లాంట్ 1200మెగా వాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉండగా.. కొత్తగా రూ.9వేల500 కోట్లతో 800మెగా వాట్ల మరో విద్యుత్తు ఉత్పత్తి ప్లాంటు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. 4ఏండ్లలో నిర్మించనున్న ఈ పనులను పూర్తి చేసేందుకు బీహెచ్ఎల్ అంగీకరించినట్లు అధికారులు చెబుతున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు ప్లాంటును సందర్శించారు. సింగరేణి అధికారులు సైతం సీఎం రాక పనులపై సమీక్షించినట్లు తెలిసింది. అక్కడి పరిస్థితులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు పరిశీలనతో సీఎం వస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఇంకా అధికారికంగా పర్యటన ఖరారు కాకపోవడంతో అధికారులు ధృవీకరించడం లేదు. అయితే రాష్ట్ర ప్రముఖలతో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఆ ఇండ్లకు మోక్షమెప్పుడో..?

- పట్టణంలో నిర్వీర్యమవుతున్న డబుల్ బెడ్‌రూంలు
- గ్రామాల్లోనూ సగం వరకు నిర్మించి వదిలేసిన వైనం
- అసంపూర్తి పనులతో రూ.కోట్ల ప్రభుత్వ ధనం వృథా
- తాజాగా వాటి పూర్తికి నిధులు కేటాయించిన ప్రభుత్వం
- ఇప్పటికైనా పూర్తిచేయిస్తేనే నిరుపేదలకు ఉపయోగం

డబుల్ బెడ్‌రూం..ఈ మాట గత ప్రభుత్వ హయాం నుంచి వినిపిస్తోంది. కేవలం మాటలకే పరిమితం అవుతోంది తప్పితే.. ఒకటి, రెండు చోట్ల తప్పితే ఎవరికీ ఒక్క ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలకు ఇప్పటికీ మోక్షం కలగడం లేదు. కొన్ని చోట్ల నిర్మించి ఏండ్లు గడుస్తుండగా.. మరికొన్ని చోట్ల స్లాబ్‌ల వరకు పరిమితమయ్యాయి. నిర్మించిన వాటిలో ఎక్కువగా శిథిలమవుతూ అక్కడే నిర్వీర్యమయ్యేలా కనిపిస్తుండగా.. స్లాబ్ స్థాయి వరకు వచ్చిన వాటి మిగితా పనులు చేపట్టేందుకు మోక్షం కలగడం లేదు. దీంతో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు కలగానే మిగిలిపోనుందనే అభిప్రాయం వ్యక్తం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం వీటిని పూర్తిచేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజా బడ్జెట్‌లో రాష్ట్రవ్యాప్తంగా రూ.304కోట్లు కేటాయించింది. వీటితో మిగిలిన పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందని తెలుస్తోంది.


ఏండ్లుగా పడి ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంలను ఈ ప్రభుత్వం పూర్తిచేయాలని భావిస్తోంది. గతంలో నిర్మించి వాటిలో బిల్లులు రావడంలేదనే కారణంగా గుత్తేదారులు మధ్యలోనే వదిలేయగా.. ప్రభుత్వం వాటిపై ప్రత్యేక దృష్టిసారించింది. వీటికి నిధులు కేటాయించి నిర్మాణాలు పూర్తిచేయించి అందించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.304కోట్లు కేటాయించడంతో పాత వాటికి మోక్షం కలగనుంది. మరోపక్క ఇప్పటికే పాతవాటిలో కొన్ని ప్రారంభం కాగా.. ప్రభుత్వం బిల్లులు కూడా త్వరితగతిన చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది వరకు బిల్లులు రావడం లేదనే కారణంగా నిలిచిపోయిన వాటిలో పలు చోట్ల ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. మరోపక్క ఇంకొన్ని చోట్ల మాత్రం అలాగే అసంపూర్తిగా కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం 2017-18 ఏడాదిలో ఆదిలాబాద్ జిల్లాలో 3579 ఇండ్లను మంజూరు చేసింది. వీటిలో ఇప్పటి వరకు కేవలం 542 ఇండ్లు మాత్రమే పూర్తి కాగా మరో 1744 ఇండ్లు నిర్మాణదశలో ఉన్నాయి. మిగితా 1293 ఇండ్లకు టెండర్లు పిలవకపోవడంతో అసలు పనులే ప్రారంభం కాని పరిస్థితి ఉంది. మరోపక్క చాలా చోట్ల ఇంటి నిర్మాణాలు పూర్తిచేసినప్పటికీ విద్యుత్తు, తాగునీరు, రోడ్లు, తదితర సౌకర్యాలు కల్పించలేదు. ఇలా ఏండ్లుగా పెండింగ్‌లో పెట్టడంతో విసుగు చెందిన స్థానిక ప్రజలు పంపిణీ చేయకముందే ఇండ్లలోకి వెళ్లి నివాసముంటున్నారు.

పట్టణంలో దయనీయం..!

ఆదిలాబాద్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూంల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. నిర్మించి అసంపూర్తిగా వదిలేయడంతో అవి అలాగే ఉండిపోయాయి. చాలా వరకు పూర్తయిన వాటిని కూడా పంపిణీ చేయడం లేదు. పట్టణ పరిధిలో 982 ఇండ్లను నిర్మించగా ఇందులో కేఆర్‌కే కాలనీలో 760, మావలలో 222 ఇండ్లను నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో వీటిని పంపిణీ చేసేందుకు అధికారులు లాటరీ పద్ధతి నిర్వహించారు. 39వార్డులకు సంబంధించిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. మిగితా వార్డులకు సంబంధించి లాటరీ పద్ధతి ప్రక్రియ చేపట్టకపోవడంతో వీటిని లబ్ధిదారులకు పంపిణీ చేయడం లేదు. దీంతో నిర్మించిన చోటనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. లోపల గదుల్లో కిటికీలు ఉండిపోయి, పైపులు పగిలిపోవడం.. విద్యుత్తు వైర్లు సైతం చోరీకి గురికావడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. భవనాల్లో ఇంకా పనులు సైతం అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం పెండింగ్ బిల్లుల మంజూరుతో పాటు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు విడుదల చేస్తే వీటిని బాగుచేసేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా పట్టణ పరిధిలో నివసిస్తున్న నిరుపేదలకు వీటిని పంపిణీ చేసేందుకు ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క గ్రామీణ ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాలు కొనసాగుతున్నాయని బిల్లులు సైతం సకాలంలోనే వస్తున్నాయని గృహ నిర్మాణశాఖ అధికారులు చెబుతున్నారు.


అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిన ఇండ్లు


పగిలిన పైప్‌లు

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనాలు అందించాలి

- అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-జైనూర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనాలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు బోధిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని వంట గదిలోకి వెళ్లి పరిశీలించారు. పాఠశాల ఆవరణలో తిరుగుతూ గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. గతంలో మూడు వందలకుపైగా ఉన్న విద్యార్థులు ఈ సంవత్సరం 156కు తగ్గడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉర్దూ మీడియం పాఠశాలలో సబ్జెక్టు వైస్‌గా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు తగ్గుతున్నారని అడిషన్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం నిధులు ఖర్చు చేసినా ఉపాధ్యాయులు లేక పాఠశాలలో విద్యార్థులు తగ్గడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో కేవలం రెగ్యులర్ ఉపాధ్యాయులు ఇద్దరే ఉన్నారు. మిగతా ఇద్దరు డిప్యూటేషన్‌పై ఉండడంతో సరైన విద్య అందడం లేదని పోషకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో గదులను పరిశీలించి ఆవరణలో ఉన్న చెత్తను సాయంత్రం వరకు క్లీన్ చేసి తనకు ఫొటోలు పంపించాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. వంటగది నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఏపీవో నగేష్‌ను ఆదేశించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, మాజీ ఎంపీటీసీ బీబీనూర్, నాయకులు అజ్జులాల, కాంగ్రెస్ పార్టీ నాయకులు కనక గంగారాం, హైదర్, చాంద్, ఏఎంసీ వైస్ చైర్మన్ సత్తార్ ఉన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని వినతి



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని నీటి ఎద్దడి సమస్యలు తీర్చాలని శుక్రవారం వీడీసీ ఆధ్వర్యంలో ఈవో అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీడీసీ చైర్మన్ అల్లగొండ పోతన్న మాట్లాడుతూ ఎండలు తీవ్రత దృష్ట్యా భూగర్భ జలాలు పడిపోయి తాగునీటి సమస్య ఏర్పడుతోందని, పలు వాడల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి నీటి కొరత తీర్చాలని విన్నవించారు. స్పందించిన అధికారి త్వరలోనే పట్టణంలో నీటి సమస్య తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు గొల్ల రాజు, సాయి, కట్ట భూమేష్ పాల్గొన్నారు.

హమాలీల సమస్యలపై కలెక్టర్ సమీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో హమాలీల సమస్యలు, లైసెన్స్‌లపై శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా సమావేశం నిర్వహించి కమిటీతో చర్చించారు. వ్యవసాయ కమిటీలలో హమాలీలకు కొత్తగా లైసెన్సులు ఇచ్చేందుకు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కమిటీల అధికారులకు హమాలీ లైసెన్సులు జారీ చేయడానికి పేపర్ ప్రకటన ద్వారా దరఖాస్తులు స్వీకరించి ఎంపిక ప్రక్రియను మార్చి చివరిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, మార్కెట్ కమిటీ చైర్మన్, మార్కెట్, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి సర్వేకు సహకరించాలి

నవతెలంగాణ-నార్నూర్



వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి సర్వేకు ప్రజలు సహకరించాలని సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. సర్వేలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ, ముస్లిం వార్డుల్లో సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027 నాటికి దేశాన్ని కుష్టురహితంగా మార్చేందుకు ప్రతి ఏటా కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వేలో వైద్య సిబ్బంది శీలా, జంగుబాయి, లక్ష్మి పలువురు ఆశాలు ఉన్నారు.

తమ్ముని జ్ఞాపకార్థం బల్లల ఏర్పాటు



నవతెలంగాణ-బోథ్

సొనాల మండల కేంద్రంలోని శివాలయం, ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం తమ్ముడు మార్చెట్టి శ్రీధర్ జ్ఞాపకార్థం అన్నయ్య మార్చెట్టి శ్రీకాంత్ బల్లలను ఏర్పాటు చేశారు. మరిన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో బల్లలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలుగుకు బదులు హిందీ పరీక్ష పత్రాలు

- కలెక్టర్ సీరియస్
- ఇద్దరు అధికారుల సస్పెండ్
- పుట్టెడు దు:ఖంలోనూ పరీక్షకు హాజరైన విద్యార్థిని

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన మొదటిరోజే గందరగోళం నెలకొంది. ఒక ప్రశ్న పత్రానికి బదులు మరొక ప్రశ్నాపత్రం రావడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. కలెక్టర్ జోక్యంతో ఆలస్యంగా పరీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో శుక్రవారం మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రారంభించేందుకు ప్రశ్నపత్రాలు ఉన్న బాక్స్‌ను ఓపెన్ చేసిన సిబ్బంది ఆశ్చర్యానికి గురయ్యారు. మొదటి రోజు తెలుగు పేపర్ ఇవ్వాల్సి ఉండగా బాక్స్‌లో హిందీకి సంబంధించిన పత్రాలు ఉండడంతో సిబ్బంది కంగారు పడ్డారు. వెంటనే జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్యకు సమాచారం ఇచ్చారు. అనంతరం విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన బోర్డు అధికారులతో మాట్లాడారు. కలెక్టర్ జోక్యంతో ఓపెన్ చేసిన పత్రాలను అందులోనే పెట్టి పోలీసుల సాయంతో తెలుగు ప్రశ్న పత్రాలకు సంబంధించిన బాక్స్‌ను పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చారు. అనంతరం విద్యార్థులు పరీక్షా రాసేలా ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల తారుమారుతో ఈ కేంద్రంలోని విద్యార్థులు 2గంటలు ఆలస్యంగా పరీక్షా రాశారు. దీంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ప్రశ్నపత్రాల తారుమారుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నపత్రాల తరలింపులో నిర్లక్ష్యం వహించిన చీఫ్ సూపరింటెండెంట్ సఫ్దర్ అలీ, డిపార్ట్‌మెంటల్ అధికారి ఆర్.పద్మజను కలెక్టర్ ఆదేశాలతో సస్పెండ్ చేస్తూ డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.


మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

పుట్టెడు దుఃఖంలో పరీక్షలకు..

తండ్రిని కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న విద్యార్థిని మంచర్ల శ్రీలత పరీక్షకు హాజరైంది. కన్నెపల్లి మండలం ముత్తాపూర్‌కు చెందిన శ్రీలత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతోంది. తండ్రి మంచర్ల మల్లయ్య(62) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం నుంచి ఆమెకు పదో తరగతి పరీక్షలు ఉండటంతో తండ్రిని కోల్పోయి గుండెల్లో బాధ ఉన్నా పరీక్షలకు హాజరైంది. పరీక్షకు వచ్చే ముందు తండ్రి మృతదేహం వద్ద శ్రీలత రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థిని శ్రీలత

సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం



నవతెలంగాణ-మందమర్రి

సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి విమర్శించారు. వెంకటేశ్వర ఆలయ ప్రాంతంలో సీపీఐ(ఎం) నాయకులు శుక్రవారం బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శితో పాటు మండల కార్యదర్శి దూలం శ్రీనివాస్ 3వ వార్డు ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. 14సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు గుంతలతో కంకర తేలినప్పటికీ కొత్త రోడ్డు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కంకర వల్ల వాహనాలు స్కిడ్ అయ్యి కిందపడి గాయాల పాలవుతున్నారని పేర్కొన్నారు. మురుగు కాలువల నుండి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతోందన్నారు. వీటన్నింటికీ తోడు విపరీతమైన దోమలతో కాలనీవాసులు నరకయాతన అనుభవిస్తూ రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. వీధి లైట్లు వెలగక రాత్రి సమయంలో పాములు రోడ్డు మీద కనబడక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెట్ల కొమ్మలు పెరిగి కరెంటు తీగలపై ప్రమాదకరంగా ఉన్నాయని, లక్షల రూపాయలు ఖర్చు చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నడవడానికి వీలు లేకుండా తయారైందని తెలిపారు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు బేతి భరత్, దూలం అంజలి పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : శ్రీహరిరావు



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ రూరల్ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామంలో రూ.20 లక్షలు, లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామంలో రూ.30లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, రత్నాపూర్‌కాండ్లి మాజీ సర్పంచ్ కోండ్రు రాంరెడ్డి, మాజీ ఎంపీపీ నరేష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు ఓసా రాజేశ్వర్, నారాగౌడ్, మాజీ సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, భీమన్న, తునికి నారాయణ, మేకల రాజేందర్, మాజీ సింగల్ విండో చైర్మన్ పోతారెడ్డి పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-నస్పూర్

పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాలకు అరగంట ముందే చేరుకున్నారు. వేసవి దృష్ట్యా వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్‌లను మూసివేశారు. పరీక్షలు ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, కస్తూరిబా గాంధీ విద్యాలయంలో పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 146 మంది 145 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కస్తూరిబా గాంధీ విద్యాలయంలో 130 మంది పరీక్ష రాశారని మండల విద్యాధికారి డాక్టర్ సునీత తెలిపారు. ఎస్సై ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


నస్పూర్‌లో..



చింతలమానేపల్లిలో..

బజార్‌హత్నూర్ : మండలంలోని రెండు పరీక్షా కేంద్రాలలో పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జాతర్ల స్పోర్ట్స్ స్కూల్ పరీక్ష కేంద్రంలో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులతో పాటు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల మాడగూడ, భుతాయి, దేగామ ఉన్నత పాఠశాలల విద్యార్థులు 124 మంది. ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఆ స్కూల్ విద్యార్థులతో పాటు పిప్రి బాలుర గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు 188 మంది పరీక్షకు హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రాల ఇన్‌చార్జి తెలిపారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు పాఠశాలలకు చెందిన మొత్తం 207 మంది విద్యార్థులకు 205 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యార చీఫ్ సూపరింటెండెంట్ నానాజీ, డిపార్ట్మెంట్ ఆఫీసర్ అశోక్ తెలిపారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు

నవతెలంగాణ-కడెం

సదర్‌మాట్ చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతు నాయకులు హపావత్ రాజేందర్ అన్నారు. శుక్రవారం చిట్యాల గ్రామ రైతులతో కలిసి కడెం ప్రాజెక్టు, సదర్‌మాట్ ఈఈ విఠల్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. పొలాలు పొట్ట దశలో ఉన్నాయని, రెండు తడులు నీరు అందకుంటే పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలపడంతో స్పందించిన ఈఈ సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారని వారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రమేష్, నరేందర్ రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతి ఉన్నారు.



చలి వేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. నర్సాపూర్(జి) గ్రామంలోని బస్టాండ్ ప్రాంగణంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవి కాలం పూర్తయ్యే వరకు చలి వేంద్రంతో ప్రతి రోజా స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.



ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 30 మంది గైర్హాజరు
- కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ



పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థినులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 10048 మంది విద్యార్థులకు గాను 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కొనసాగే సమయంలో కేంద్రాల వద్ద 163 సెక్షన్‌తో పాటు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు. పరీక్ష సమయం కంటే గంట ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. అరగంట ముందు నుంచి విద్యార్థులను లోనికి అనుమతించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏఎన్‌ఎంతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. తొలి పరీక్షకు 1,00,013 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరైనట్టు డీఈఓ ప్రణీత తెలిపారు.

కేంద్రాలను సందర్శించిన కలెక్టర్...

పట్టణంలోని విద్యానగర్‌లో గల జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షిషా సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పరీక్ష రాస్తున్న విదానాన్ని పరిశీలించి భయం లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఆయన వెంట శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, అధికారులున్నారు.

కేంద్రాలను సందర్శించిన ఎస్పీ...

పట్టణంలోని లిటిల్ స్టార్ హైస్కూల్, ప్రభుత్వ గెజిటెడ్ నెంబర్ వన్ హై స్కూల్‌లలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. పరీక్ష తీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలలోనికి సెల్ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని పేర్కొన్నారు. దగ్గర్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లను పరీక్ష పూర్తి అయ్యేంతవరకు మూసి ఉంచే విధంగా సిబ్బంది పర్యవేక్షించాలని తెలిపారు.



గడప మొక్కుతూ...

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద కొంతమంది విద్యార్థులు తమ భక్తి భావాన్ని సంప్రదాయాన్ని చాటుతూ కనిపించారు. పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ఇదే మొదటి సారి కావడంతో కొంత ఒత్తిడికి లోనై భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని బాలికల పాఠశాల పరీక్ష కేంద్రంలో తమ సెంటిమెంట్ ప్రకారం గడపను మొక్కుతూ లోనికి వెళుతూ కనిపించారు.

నిర్మల్‌రూరల్ : పదో తరగతి పరీక్ష కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, జిల్లా కేంద్రంలోని రవి హైస్కూల్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి, ఆరా తీశారు. సీసీ కెమెరా నిఘా నడుమ నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా లేదా, నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచార లేద అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఏఎన్ఎం, సిబ్బంది, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించ కూడదని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావ్, అధికారులు పరమేశ్వర్, తహసీల్దార్‌లు మల్లేష్, రాజు, సిబ్బంది ఉన్నారు.

ఉట్నూర్ : పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం మండలంలో ప్రారంభమయ్యాయి. పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సమయానికి ముందే పరీక్ష కేంద్రం వద్ద చేరుకున్నారు. ఉపాధ్యాయులు గేటు వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు. పరీక్ష సమయంలో ఎలాంటి అవంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలను పాటించారు.



లిటిల్ స్టార్ స్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

- అటవీ దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అనేక సంపదతో గిరిజనులకు జీవనోపాధి ఇస్తున్న అటవీని రక్షించాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎఫ్ఆర్ఓ గులాబ్ సింగ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎఫ్ఓ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అటవీ రక్షణ నినాదాలు చేస్తు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా గులాబ్ సింగ్ మాట్లాడుతూ అడవులు ప్రజలకు ఆక్సిజన్, పండ్లు ఇస్తామయన్నారు. అదే విధంగా అటవీలో నివాసం ఉండే గిరిజనులకు జీవనోపాధి కూడా ఇస్తుందన్నారు. దీన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అడవీలో నిప్పు చెలరేగిన, చెట్లను ఎవరు నరికిన వెంటనే ఆటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అదే విధంగా ప్రతి ఇంట్లో ఐదు మొక్కలు నాటి పర్యావరణ పపరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ ప్రమోద్ కుమార్, సెక్షన్ ఆఫీసర్లు అహ్మద్ ఖాన్, గులాబ్, ధన్సింగ్, మోహబ్బత్‌రావు, బీట్ ఆఫీసర్లు సవిత, జ్యోతి, జ్యోత్స్న పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీనియర్ నాయకులు జాదవ్ విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తాడిహత్నూర్‌లో రైతులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రబీలో సీజన్‌లో శనగలు తీసి నెలలు కావస్తున్న ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని వాపోయారు. ముందే ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా ఉండటంతో పంటలు పండలేదని, రైతుల పంటలకు మద్దతు ధర రాలేదని పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోతున్నారని దీనితో అప్పుల పాలవుతున్నారని అన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే మద్దతు ధరతో శనగలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, రైతులను ఆదుకోవాలని కోరారు. వారి వెంట రైతులు రాథోడ్ ఉత్తం, చకోర్ గంగాధర్, కొండిబా ఉన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ బార్ అసోసియేషన్ 2025-26 ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ముగిసినట్టు ఎన్నికల అధికారులు నూనె గంగాధర్, ఓస మహేందర్ శుక్రవారం తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి అల్లూరి మల్లారెడ్డి, లోకా లక్ష్మారెడ్డి, కల్వకుంట్ల వినోద్‌రావు నామినేషన్లు దాఖలు చేయగా, ప్రధాన కార్యదర్శి పదవికి వీవీ రమణారావు, షేర్ నరేందర్, ఉపాధ్యక్ష పదవికి అంపోలి నర్సారెడ్డి, కోశాధికారి పదవికి సిహెచ్ అర్చన, సంయుక్త కార్యదర్శి పదవికి ఏ ముత్తన్న, లైబ్రరీ కార్యదర్శి పదవికి ఆర్ రత్నం, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి పదవికి పి. వంశీకృష్ణ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని తెలిపారు. ఈనెల 22న నామినేషన్ల ఉపసంహరణ, 27న బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



నవతెలంగాణ-బోథ్

క్రీడలతోనే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసంగా ఉంటుందని మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. శుక్రవారం సొనాల మండల కేంద్రంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆయన చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొనాల మండల పరిధిలోని యువకులు క్రీడాకారులు కలిసి అత్యున్నత ప్రమాణాలతో ఈ లీగ్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడా స్ఫూర్తితో స్నేహపూర్వక వాతావరణంలో క్రీడాకారులందరు ఐక్యం చేయడానికి ఈ లీగ్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, నిర్వహణ దాతలు గాజుల పోతన్న, నాయకులు ప్రతాప్, విజయ్, బోరె రవీందర్, బత్తుల రమేష్ పాల్గొన్నారు.

నేడు ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఓవర్ సీస్ మ్యాన్ పవర్ (టామ్‌కామ్) కంపెనీలో పనిచేయడానికి ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో వివిధ ట్రేడులో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయడానికి కంపెని ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులు ఎసెస్సీ, ఐటీఐ, క్యాస్ట్, ఆధార్ కార్డ్, రెండు పాస్ ఫోటో ఫోటోలు, బయోడాటా ఫార్మ్ రెండు జతల సర్టిఫికెట్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు. జిల్లాలో ఐటీఐ పాసైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

శ్రీ వందన ఆస్పత్రి నిర్మల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, బీజేపీ నాయకులు వి.సత్యనారాయణగౌడ్ కొనియాడారు. శుక్రవారం సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన స్వగ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసి నిరుపేదలకు వైద్య సేవలు అందించిన శ్రీ వందన ఆస్పత్రి యాజమాన్య సభ్యులు శ్రీ వి.సురేష్‌గౌడ్, సతీష్, డాక్టర్ ప్రసాద్, ఆస్పత్రి వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మరిన్ని ఉచిత వైద్య సేవలు అందించి, సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు. లాభాపేక్ష లేకుండా, అంకితభావంతో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు ఎప్పుడు గుర్తుంచుకుంటారని అన్నారు. వీరు అందిస్తున్న వైద్య సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ సర్పంచ్ దేవేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బర్మ రాజ నర్సయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ బి గంగాదాస్, మాజీ ఉపసర్పంచ్ బొజ్జ భీమేష్, రంజిత్‌గౌడ్, రహమత్, పసుపుల అశోక్, ఇబ్రహీం, విజయ్‌గౌడ్ గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఐదో రోజుకు సీపీఐ దీక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలం అర్లి(బి) గ్రామపంచాయతీ పరిధిలోని నిషాన్‌ఘాట్‌లో కనీస మౌలిక సదుపాయలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కాలనీకి చెందిన మహిళలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. టెంట్ వేసుకుని రిలే నిరాహార దీక్షలకు కూర్చున్నారు. ఈ దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కలవేణి శంకర్, జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి శిబిరాన్ని సందర్శించి వీరికి తమ మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 38లోని నిషాన్‌ఘాట్‌లో ప్రజలకు కనీస మౌలిక సదుపాయలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయమై గతంలో ఎన్నోమార్లు ఆందోళనలు, ధర్నాలు చేపట్టినప్పటికీ అధికారుల నుంచి స్పందన కానరావడం లేదన్నారు. గత 8, 9 సంవత్సరాల నుంచి పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తుంటే వారిని పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. విష పురుగుల మధ్య భయం భయంగా బతుకులు వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఇతర మౌలిక వసతులు కల్పించేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలి

- హెచ్‌సీయూ యూనివర్సిటీ భూమి వేలం ఆపాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-నిర్మల్

ఉస్మానియా యూనివర్సిటీ సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలని, హెచ్ సీయూ యూనివర్సిటీ భూమి వేలం ఆపాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగరపు రజనీకాంత్ అన్నారు. ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం తమ సంఘ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉద్యమాలకు ఊపిరి పోసిన ఉస్మానియా యూనివర్సిటీలలో వైస్ ఛాన్సలర్, రిజిస్టర్ నిరంకుశ వైఖరితో ఒక సర్క్యులర్ విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఉస్మానియా విద్యార్థులు గొంతులు నొక్కడానికే ఈ సర్క్యులర్ తీసుకురావడం జరిగిందని విమర్శించారు. పోరాటాలకు పుట్టినిల్లు అయిన ఉస్మానియాలో ఉద్యమాలను నిలిపి వేయడం కోసం ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ వందేమాతరం ఉద్యమం నుంచి గత ప్రభుత్వం నియంత్రణ పాలన వరకు ముందుండి పోరాడిన విద్యార్థులు పోరాటాలను అణిచివేయడం ఎవరి తరం కాదని, గంటపదంగా చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీలలో అనేక సమస్యలతో విద్యార్థులు చదువుతున్నారని, మెస్ బకాయిలు, స్కాలర్‌షిప్స్, హాస్టల్ రిపేర్లు పెండింగ్‌లో ఫెలోషిప్స్ ఉన్నాయని తెలిపారు. రెగ్యులర్ ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. సెల్ ఫైనాన్స్ కోర్స్ పేరుతో వేలాది రూపాయలు తీసుకుంటున్నారని, వీటికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న విద్యార్థులను గొంతు నొక్కడం ఈ సర్క్యులర్ అని మండిపడ్డారు. ప్రజా పాలన పేరుతో ప్రభుత్వం ఏర్పడి యూనివర్సిటీలను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వా ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని అణిచివేయడం కోసం మేధావులకు నేలువైన యూనివర్సిటీలలో ఇలాంటి సర్క్యులర్ తీసుకురావడం హేయమైన చర్య అని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం భూములను వేలం వేయడం ఆపివేయాలని అన్నారు. అదేవిధంగా సెంట్రల్ యూనివర్సిటీ భూములను పరిరక్షించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి దిగంబర్, పృథ్వీరాజ్, హరిఓం, కపిల్, రాకేష్, కార్తీక్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అంతం చేయడానికే ప్రణాళికతో ముందుకు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వంద సంవత్సరాల్లో సికిల్‌సెల్ అంతం చేయడానికి ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. శుక్రవారం డీఎంహెచ్ కార్యాలయ సమావేశ మందిరంలో సికిల్ సెల్‌పై జిల్లాస్థాయి టీఓటీ శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సికిల్ సెల్ ఏ విధంగా వ్యాప్తి చెందుతుంది. దాన్ని ఎలా కట్టడి చేయాలో ప్రాజెక్టర్ ద్వారా మెడికల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ రాష్ట్రంలో 2047 వరకు సికిల్‌సెల్ ఎనిమియాను అంతం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. సికిల్ సెల్ ఎనిమియాతో అనేక మంది బాధపడుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన పోషకాల గురించి వైద్యులకు తెలియజేయడం జరుగుతుందని, వారు క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన కల్పించాలన్నారు. 2047 వరకు రాష్ట్రంలో సికిల్‌సెల్ ఎనిమియా లేకుండా చేయడంలో ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. సికిల్ సెల్ వల్ల కణాలు రక్త సరఫరాకు అడ్డంకులు వస్తాయన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఇది ఎక్కువగా ఉందన్నారు. కేరియర్‌లో ఎలాంటి లక్షణాలుండవన్నారు. కానీ వారు ఇంకోకరికి అంటించే అవకాశాలున్నాయని తెలిపారు. ముందుగా వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తే వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్ డాక్టర్ సాధన, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్, ఏటీడీఓ అనిల్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో బీసీ రిజర్వేషన్ 42శాతానికి పెంచి శాసనసభలో బిల్లు పాసు చేసినందుకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం గుడిహత్నూర్ మండలంలో పార్టీ ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాలతో కలిసి సీఎంకు మంత్రి సీతక్కకు పాలభిషేకం చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలాజీ పటేల్, మాజీ మండలాధ్యక్షులు అంకత్ రవి, కరాడ్ బ్రహ్మానంద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆడే శీల, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ నాగనాథ్, పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు గణేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ మెస్రం జలంధర్, రాథోడ్ రమేష్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com

ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు సమీక్షా సమావేశం నిర్వహించగా, డీఎల్‌పీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీలలో శానిటేషన్ ప్రక్రియ నిరంతరం జరిగేలా చూడాలని, పంచాయతీల్లో నిర్వహిస్తున్న నర్సరీల్లో పూర్తి స్థాయిలో జర్మినేషన్ అయ్యేలా చర్యలు చేపట్టాల్సిందిగా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, లైబ్రరీ సెస్ రిమిటెన్స్ చేయాలని లబ్ధిదారుల నుంచి ఎల్ఆర్ఎస్ పేమెంట్ జరిగేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

కోమటిచేను, దేవాపూర్‌లో డీఆర్‌డీఓ పర్యటన

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కోమటిచేను, దేవాపూర్ గ్రామ పంచాయతీలో డీఆర్‌డీఓ కిషన్ శుక్రవారం పర్యటించారు. కోమటిచేను గ్రామ పంచాయతీని సందర్శించి 1000 కోళ్లతో నిర్మించబోయే కోళ్ల ఫారం పనులను పరిశీలించారు. దీంతో పాటు పలు ప్రభుత్వ పథకాల పనులను పరిశీలించారు. ఈ మేరకు వాటి వలన కలిగే ఉపయోగాలు లాభాలను లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవాపూర్ గ్రామ పంచాయతీ నర్సరీని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. తొలిరోజు 148 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష రాసినట్లు సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహసిల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఆల్బర్ట్, ఎస్సై కొమురయ్య తనిఖీ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-బెజ్జూర్

అందుగులగూడ గ్రామానికి చెందిన గేడం వెంకటి(45) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఇటీవల ఊట్పల్లి వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు భార్య పద్మ తెలిపారు. కుటుంబ యజమాని రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

నవతెలంగాణ-పెంచికల్ పేట్

గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో ఆల్బర్ట్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు పనిచేసేలా దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలు తీర్చడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు రోజువారి వేతనం రూ.300 వచ్చేలా పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎఫ్ఆర్ఓ అనిల్ కుమార్, ఏపీఓ సతీష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల ధర్నా



నవతెలంగాణ-జైనూర్

ఆశాల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని ఆ యూనియన్ నాయకులు సులోచన అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ.18వేలు జీతాలు అందించి ఆదుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎంతో పని చేసినా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రభుత్వం ఆశా వర్కర్లను చిన్నచూపు చూడకుండా అసెంబ్లీలో చర్చించి గౌరవ వేతనంగా రూ.18వేలు అందించడానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఓములాబాయి, సావిత్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్, నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో అందించిన శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జనకాపూర్‌లో గల పాత కలెక్టరేట్ భవనంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్, నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో 40 రోజులపాటు కంప్యూటర్ శిక్షణ పొందిన అభ్యర్థులకు డీఆర్‌డీఓ దత్తారావుతో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను వినియోగించుకొని జీవితంలో ఎదగాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా కృషి చేయాలని తెలిపారు. 40 రోజులపాటు కంప్యూటర్ శిక్షణ, టైప్ రైటింగ్ మెళకువలు అభ్యర్థులకు అందించడం జరిగిందని, శిక్షణలో పొందిన నైపుణ్యతతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో నిలదొక్కుకోవాలని అన్నారు. వివిధ కంపెనీలలో పని చేసేందుకు అవకాశాలు ఉన్నాయని, శిక్షణలో పొందిన నైపుణ్యత, పరిజ్ఞానంతో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం సమన్వయకర్త సాయికుమార్, శిక్షకులు పాల్గొన్నారు.

విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అరెస్ట్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు చలో అసెంబ్లీకి పిలుపు నివ్వగా పోలీసులు వెళ్లకుండా అరెస్ట్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, నాయకులు అయ్యూబ్ ఖాన్, మహమ్మద్‌తాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో గొంతు నొక్కలేరని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

ఆసిఫాబాద్ : క్రీడల పట్ల ఆసక్తి ఉన్న సిబ్బందిని ప్రోత్సహిస్తామని ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. హర్యానా రాష్ట్రం మధుబన్‌లో 73వ ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సెపక్ తాక్రా క్రీడల్లో రాష్ట్ర పోలీస్ బృందం తరపున పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించిన స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ గోపిని శుక్రవారం కార్యాలయంలో శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలు ఆడడంతో మానసిక ప్రశాంతత కలగడంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, కిరణ్ పాల్గొన్నారు.

ఎస్సీఎంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

- లేనిపక్షంలో కమిషనర్ కార్యాలయం ముట్టడిస్తాం
- కమిషనర్‌కు తేల్చిచెప్పిన సీఐటీయూ రాష్ట్ర నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు

కాగజ్‌నగర్‌లోని సిర్పూరు పేపర్ మిల్లులో గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు శుక్రవారం కార్మికశాఖ కమిషనర్ సంజయ్‌కుమార్‌ను కోరారు. హైద్రాబాద్‌లో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లిఖార్జున్, భూపాల్, రాష్ట్ర కార్యదర్శి మల్లేష్‌లు కమిషనర్‌ను కలిసి సమస్య వివరించి చెప్పడంతో పాటు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్ మాట్లాడుతూ సిర్పూరు పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ ప్రారంభించినట్లే ప్రారంభించి అనంతరం దీనిని నిలిపివేశారని అన్నారు. మిల్లు పునఃప్రారంభం తర్వాత ఇప్పటి వరకు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించలేదని, కార్మికులే కమిటీగా ఏర్పడి సమస్యలను యాజమాన్యానికి వివరించినా స్పందన లేదని అన్నారు. ప్రస్తుతం కార్మికులు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారని అన్నారు. యాజమాన్యం చెప్పిందే మాట, చేసిందే శాసనంగా ఉందని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతిపత్రం ఇచ్చి ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని అన్నారు. మిల్లులో వెంటనే ఎన్నికలు నిర్వహించకపోతే కార్మికులతో కలిసి ఛలో కమిషనర్ ఆఫీస్ కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. దీనికి స్పందించిన కమిషనర్ ఎన్నికల నిర్వహణకు డీసీఎల్‌కు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-జైనూర్

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరగా పూర్తయ్యే విధంగా పనులను వేగవంతం చేయాలని లోకల్ బాడీ అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న మార్కెట్ ఆవరణలో నిర్మాణం చేస్తున్న సులబ్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు.. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండాలంటే సులబ్ కాంప్లెక్స్ పనులు వచ్చే నెల 10వ తేదీలోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం మండలంలోని మార్లవాయి గ్రామానికి వెళ్లి ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ఇళ్లను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో మంజూరైన 52 ఇల్లు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. దఫాలవారీగా ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన బిల్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నీటి సమస్య ఉందని గ్రామస్తులు జిల్లా అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి గ్రామానికి నీళ్లు అందించేలా చర్యలు చేపట్టాలని స్థానిక మండల అభివృద్ధి అధికారి సురేందర్ రెడ్డిని ఆదేశించారు. నీటి సమస్య లేకుండా చూసేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, ఏపీవో నరేష్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, స్థానిక మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి

- ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



జెండావిష్కరణ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సివిల్ సప్లై హమాలీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని ఎఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజు సూచించారు. శుక్రవారం సివిల్ సప్లై హమాలీ కార్మికుల జిల్లా నాలుగో మహాసభను కాగజ్‌నగర్‌లోని మార్కెట్ యార్డులో నిర్వహించారు. ముందుగా కార్మికసంఘం పతాకాన్ని బాలరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య సంస్థ సివిల్ సప్లై కార్పోరేషన్‌లోని హమాలీలు, స్వీపర్లు, దినసరి కూలీల పరిస్థితి దయనీయంగా ఉందని అన్నారు. బడా వ్యాపారులకు వందల కోట్ల రాయితీలు ఇచ్చే ప్రభుత్వం పేద ప్రజలకు అన్నం పెట్టే సివిల్ సప్లై కార్పోరేషన్‌ను వ్యాపార కోణంలో చూడటం సరికాదని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సివిల్ సప్లైకు రావాల్సిన 11 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్పోరేషన్‌లో పని చేస్తున్న హమాలీలు, స్వీపర్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచాలని, ఎఫ్‌సీఐ మాదిరిగా హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, బోనస్ రూ. 10 వేలకు పెంచాలని, రిటైర్డ్ అయిన హమాలీలకు ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి దివాకర్, నాయకులు సుధాకర్, బుదాజి, దత్తు, సత్యనారాయణ, శంకర్, కొమురక్క, అమృత, తిరుపతి పాల్గొన్నారు.

మొదటి రోజు పది పరీక్షలు ప్రశాంతం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు పదవ తరగతి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను తనిఖీ చేయడంతో పాటు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కాకుండా పరీక్షలు నిర్వహించాలని, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ డీవి శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ పరిశీలించడంతో పాటు బందోబస్తు వివరాలను స్థానిక సీఐ రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అనితను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 36 సెంటర్లు ఏర్పాటు చేయగా మొదటి రోజు 6560 మంది పరీక్ష రాయనుండగా 6531 మంది పరీక్షకు హాజరుకాగా 29 మంది గైర్హాజరయ్యారని, మొత్తం హాజరు శాతం 99.25 శాతంగా ఉందని జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయభాబు తెలిపారు.



పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో మాదిగలకు గుర్తింపు

- ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు మల్యాల అశోక్

నవతెలంగాణ-తిర్యాణి

రాష్ట్రం మాదిగ సమాజానికి ఉన్నత స్థానాన్ని కల్పించి గుర్తింపును ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లాయల అశోక్ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టినందుకు శుక్రవారం మండలంలోని స్థానిక కుమురంభీం చౌరస్తాలో దండోరా డప్పుచప్పుళ్ల మధ్య తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటంతో పాటు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా విరామం లేని పోరాటం చేస్తూ ఎన్ని ప్రభుత్వాలు మారిన నెరవేరని కలని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమకల నెరవేరిందని తెలిపారు. మందకృష్ణ మాదిగ విరామం లేని పోరాటం వల్లనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. మాదిగలు ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మండల నాయకులు కరిగంటి బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్, నాయకులు పెరుమండ్ల వెంకటేశం గౌడ్, కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు పున్నం కుమార్, ఎంఆర్‌పీఎస్ ఉపాధ్యక్షుడు శేర్ల ఎల్లయ్య, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు మెరుగు వెంకటేశం, నాయకులు గద్దల బాపు, పడిగెల అమర్, ఆవునూరి రవీందర్, షేర్ల ఆశయ, షేర్ల అంజయ్య పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో గాలి వాన బీభత్సం

- ఇల్లు కూలి వృద్ధుని మృతి
- నేలకూలిన భారీ వృక్షాలు
- వంగిన విద్యుత్ స్థంభాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం గాలి వాన బీభత్సం సృష్టించింది. గంట పాటు భారీ గాలి వీయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పట్టణంలోని పలు కాలనీలలో చెట్లు పెద్ద శబ్దంతో నేలరాలాయి. స్థానిక తిలక్‌నగర్‌లో రెండిళ్ల కుప్పకూలగా, నౌగాంబస్తీలో ఒక ఇల్లు కూలి వృద్ధుడు దౌలత్ (79) మృతి చెందాడు. పట్టణంలోని పోచమ్మ ఆలయం ముందు ఉన్న పురాతన వృక్షం నేలరాలింది. లారీ చౌక్ నుండి అటు విజయబస్తీ చౌరస్తా, ఇటు ఈఎస్ఐ ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి ప్రధాన రహదారిపై పడ్డాయి. విద్యుత్ స్థంభాలు నేలకు ఒరగడంతో పట్టణంలో విద్యుత్ సరఫరా స్థంభించిపోయింది. ఈజ్‌గాం వెళ్లే దారిలో కూడా చెట్లు నేలరాలాయి. శివాపూర్ వెళ్లే దారిలో ఉన్న కోళ్లఫారంలోని సుమారు 200 కోళ్లు గాలి ధాటికి మృతి చెందాయి. కాగజ్‌నగర్ మండలం కోసినిలో ఇంటి ముందున్న వేపచెట్టు కూలి ఎదురుగా ఉన్న ఇంటిపై పడింది.

విద్యార్థులు ద్విచక్రవాహనాలు నడిపితే కఠిన చర్యలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పదవ తరగతి పరీక్షకి హాజరు అయ్యే విదార్థులకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులను ఎస్సై కమలాకర్ కోరారు. శుక్రవారం మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ లైసెన్సు లేని విద్యార్థులుకు వాహనాలు ఇస్తుండటంతో వారు ప్రమాదాలకు కారకులు అవుతున్నారన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైనట్లయితే ఆ బండి యజమానలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ టెండర్ల ఆహ్వానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శాంతి భద్రతల పరిరక్షణ కోసం జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలో దాదాపు 50 సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు కై టెండర్ ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కోట కింద, కలెక్టర్ ఆదేశాల ప్రకారం రూ.8 లక్షల బడ్జెట్‌లో, సీసీ కెమెరాలో ఏర్పాటు, కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన కాంట్రాక్టర్స్ వారి దరఖాస్తులను ప్రకటన తేదీ నుంచి మూడు రోజుల లోపు జిల్లా పోలీస్ కార్యాలయం ఆసిఫాబాద్‌లో అందించాలని, ఇతర వివరాలకు సెల్ : 87126 70523ను సంప్రదించగలరని తెలిపారు.

నేడు మేకల సంత వేలం పాట

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం మేకల సంత వేలంపాట నిర్వహించడం జరుగుతుందని రాజంపేట పంచాయతీ సెక్రెటరీ కిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీన నిర్వహించిన వేలం పాటలో పాల్గొని మేకల సంతను దక్కించుకున్న వ్యక్తి నిబంధనలు పాటించలేదని అలాగే రెండవ స్థానంలో ఉన్న వ్యక్తి కూడా నిబంధనలు ఉల్లంఘించడంతో వేలంపాట రద్దుచేసి మళ్లీ వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ ఇద్దరు వ్యక్తులు భవిష్యత్తులో వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల గిరిజనులు నేటి వేలంపాటను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్సరీ పరిశీలన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని బొంబాయిగూడ గ్రామ నర్సరీని శుక్రవారం ఎంపీడీవో ఆల్బర్ట్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీలో వంద శాతం జర్మినేషన్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రైమరీ బెడ్స్ నిర్వహణ సరిగ్గా చేయాలని, నర్సరీ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు వివరాలు పొందుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరేష్, రాకేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
4
శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com

లక్షెట్టిపేటలో వడగండ్ల వాన

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని పలు గ్రామాల్లో,పట్టణంలో వడగళ్ల వాన దంచి కొట్టింది. శుక్రవారం సాయంత్రం ప్రాంతంలో మండలంలోని ఎల్లారం, వెంకట్రావుపేట, తదితర గ్రామాల్లో ఒక్కసారిగా మబ్బులు కమ్మి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వడగళ్ల వర్షం కురువడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

కాసిపేట : మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయమే దంచికొట్టిన ఎండ సాయంత్రం నాలుగు గంటలకు ఒక్క సారిగా మబ్బులు కమ్ముకువచ్చి వర్షం పడింది. ఉరుములు, మెరుపులు భారీగా వచ్చినా వర్షం మాత్రం తేలికపాటిగా పడింది.

31లోపు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలి

నవతెలంగాణ-మందమర్రి

ఈ నెల 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించాలని మందమర్రి తహసీల్దార్ సతీష్ తెలిపారు. శుక్రవారం బొక్కలగుట్ట గ్రామంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 31లోపు రుసుము చెల్లిస్తే 25 శాతం తగ్గింపు వర్తిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సతీష్

మూడు దశాబ్దాల పోరాటం ఫలించింది

- ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ



నవతెలంగాణ-జైపూర్

ఎస్సీ వర్గీకరణ కోసం ముప్పై ఏండ్లుగా కొనసాగిస్తున్న పోరాటానికి ప్రతిఫలం లభించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదించిన సంధర్భంగా స్థానిక నాయకులతో కలిసి గురువారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ రాజీలేని పోరాటానికి ప్రతిఫలం లభించిందని అన్నారు. మూడు దశాబ్దాలుగా కొనసాగిన పోరాటంలో అనేక ఒడిదొడుకులు, అవమానాలు, నిందలు, నిర్భందాలు ఎదుర్కొన్నామని అన్నారు. రాజకీయ నాయకుల ప్రలోభాలకు గురికాకుండా జాతి కోసం పోరాటం చేస్తూ అనారోగ్య సమస్యలు ఉన్నా మందకృష్ణ మాదిగ సారథ్యంలో పోరాడిన ఉద్యమకారులకు ఈ సంధర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ముప్పై సంవత్సరాల పోరాటానికి అండదండలందించిన రాజకీయపార్టీలకు, అన్ని వర్గాల ప్రజలకు మేధావులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసి చట్టబద్ధత కల్పించిన సంధర్భంగా రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జలంపల్లి శ్రీనివాస్, ఇరిగిరాల మల్లేష్, జలంపల్లి రాకేష్, నిట్టూరి జనార్ధన్, తోకల మహేశ్, ఆసంపల్లి శ్రీకాంత్, అభిరామ్, సడవలి, మల్లేష్, రకేష్, వెంకటేష్, గడ్డల అనిల్, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా శుక్రవారం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న కొత్తూరు గ్రామ పంచాయతీలో 15 నూతన ఇండ్లు నిర్మించుటకు భూమి పూజలు చేశారు. తెలంగాణ గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఆర్డీఏ డైరెక్ట్ మెంబరు అంకతి శ్రీనివాస్, ఎంపీడీఓ కె సరోజ, పంచాయతీ కార్యదర్శి గోపతి రాజేష్, అధికారులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విత్తన వ్యాపారుల ఇండ్లలో సోదాలు

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ నెన్నేల ఎస్ ఐ ప్రసాద్ పోలీస్ సిబ్బంది తో కలిసి గతంలో నకిలీ పత్తి విత్తనాలు అమ్మిన వ్యాపారుల ఇండ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేని నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు నకిలీ విత్తనాలను వాడ రాదని తెలిపారు, గ్లైఫోసెట్ విత్తనాల వాడకం వల్ల భూమి సారం దెబ్బతింటుందని పర్యావరణానికి హాని కలుగుతుందన్నా రు.

కాకతీయ కెనాల్‌లో పడి విద్యార్థి మృతి

నవతెలంగాణ-జన్నారం



కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మపెల్లి సమీపంలోని కాకతీయ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన విద్యార్థి వాసాల అరవింద్(21) మృతి చెందాడు. అరవింద్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. అరవింద్ రెండు రోజుల క్రితం అతని స్నేహితులతో కలిసి కెనాల్‌లోకి ఈతకు వెళ్ళాడు. అతనికి ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. అరవింద్ మృత దేహాన్ని అక్కడి పోలీసులు బయటకు తీసి కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి మార్చురీలో ఉంచారు. అరవింద్ మృతి విషయం తెలియగానే అయన తల్లి తండ్రులు లింగన్న, శంకరవ్వ తోపాటు బంధువులు కరీంనగర్ ఆస్పత్రికి తరలివెళ్లారు. దీంతో మండలంలోని చింతల పల్లె గ్రామంలో వారి కుటుంబంలో విశాదఛాయలు అలుముకున్నాయి.

గర్భిణులు పౌష్టికహారం తీసుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారాన్ని తీసుకొని పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని రేపల్లెవాడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. గర్భిణీలను పసుపు కుంకుమ పూలతో అలంకరించి నూతన వస్త్రాలను కానుకగా ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు అధిక పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పాలు పండ్లు పప్పు దినుసులు ఆకుకూరలు రోజువారి ఆహారంలో తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం గర్భిణీలకు పౌష్టికాహారం ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, రాజేశ్వరి పాల్గొన్నారు.



సీఐటీయూ నాయకుల ముందస్తు అరెస్టు



సీఐటీయూ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-జన్నారం

కార్మిక సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు వెళ్లనున్న సీఐటీయూ నాయకులను శుక్రవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో సీఐటీయూ మండల నాయకులు కూకటికారి బుచ్చయ్య, అంబటి లక్ష్మణ్, రాజన్న ఉన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు, ఉద్యోగ భద్రత పీఫ్, ఈఎస్. ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులైన బీడీ, బిల్డింగ్, హమాలీ, ట్రాన్స్పోర్ట్ కార్మికుల సమస్యలపై ఈ రోజు హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద సీఐటీయు ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. దీనికి వెళ్లకుండా అరెస్టు చేయడం దారుణం అన్నారు. రాష్ట్రంలోని అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదు. ప్రస్తుతం భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను దుర్వినియోగం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం. అసంఘటిత కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాలు మార్చుకోవాలి. బీడీ, బిల్డింగ్, హమాలీ, ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు, ఉద్యోగ భద్రత పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

బుడగ జంగాలపై ఎంత కాలం వివక్ష



బుడగ జంగాల ఎస్సీ కాలనిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీపీఐ(ఎం) నాయకులు

- దళితులంటే ఇంత చిన్నచూపా..?
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-జన్నారం

బుగుగ జంగాలపై, దళితులపై పాలకులకు ఇంత వివక్ష ఎందుకని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి ప్రశ్నించారు. శుక్రవారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని బుడగ జంగాల ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాలనీ ఏర్పడి 20 సంవత్సరాలు గడిచినా నేటికీ ఇక్కడి ప్రజలు సమస్యల సుడిగుండంలోనే జీవిస్తున్నారన్నారు. రోజువారి కూలీపనులు చేసుకుంటూ జీవిస్తున్న ఈ ప్రజలకు గత ప్రభుత్వాలు కానీ, ప్రస్తుత ప్రభుత్వం కానీ కనీస సౌకర్యాలు కల్పించకుండా ఎస్సీ బుడగ జంగాల వారిపై వివక్షతను కొనసాగిస్తున్నారు. ఇక్కడ ప్రధాన సమస్యలు రోడ్లు, మురికి కాలువలు, తాగునీరు, ఇండ్లపై నుంచి ఉన్న 11 కేవీ కరెంట్ వైర్లు తొలగించక పోవడంతో ప్రజలు ప్రమాదాలకు గురౌతున్నారు. వర్షాకాలంలో వచ్చే వరద ముంపు మూలంగా ఇండ్లు మునిగిపోకుండా కరకట్ట నిర్మాణం చేయడం అదేవిధంగా ఇక్కడి పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకపోవడం సోచనీయం అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాబోయే కాలంలో పోరాటలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు దుంపల రంజిత్ కుమార్, మండల కార్యదర్శి అశోక్, మగ్గిడి జయ, సభ్యులు ఆడే చంద్రకళ, ఒరగంటి వనిత, తలండి దీపిక, గెడం లక్ష్మి, కనికరపు జమున పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించాలి

- నిరసన కార్యక్రమానికి హెచ్ఎంఎస్ పిలుపు



తెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను సత్వరమే పరిష్కరించాలని హెచ్ఎంఎస్ సెంట్రల్ కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని కాంట్రాక్టు కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2016 నుండి ఫిక్స్ కార్మికులకు 8.33 శాతం బోనసుల చెల్లించాలని, ఫిక్స్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఐదు సంవత్సరాలు నిండిన అన్‌స్కిల్డ్ కార్మికులకు స్కిల్డ్ ప్రమోషన్ ఇచ్చి సంబంధిత వేతనాలు చెల్లించాలన్నారు. రెండు సంవత్సరాలు అన్ స్కిల్డ్‌గా పనిచేసి నైపుణ్యం కనబరిచిన కార్మికులకు కూడా స్కిల్డ్ ప్రమోషన్ ఇచ్చి వేతనాలు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. కానీ ఐదు సంవత్సరాలు గడిచినా కూడా స్కిల్డ్‌గా ప్రమోషన్ ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దసరా పండుగకు ఒక నెల వేతనం బోనస్‌గా చెల్లించాలని, మంచిర్యాల నుంచి వచ్చే కార్మికులకు పెగడపల్లి, గంగిపెల్లి, ఎల్ కంటి, టేకుమట్ల ఇందారం మీదుగా విధులకు హాజరయ్యే కాంట్రాక్టు కార్మికులకు ప్లాంట్ లోపటివరకు బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 70 శాతం లోకల్ 30 శాతం నాన్ లోకల్ కాకుండా 70 శాతం నాన్ లోకల్ అంటూ 30 శాతం లోకల్ అని తప్పుడు అగ్రిమెంట్ చేస్తూ 610 జీవోను తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఏరియా నాయకులు నామాల శ్రీనివాస్, నోముల బాలయ్య పాల్గొన్నారు.

ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు



జైపూర్ : భీమారం పరిక్షా కేంద్రం వద్ద బందోబస్తులో ఎస్ఐ శ్వేత

నవతెలంగాణ-మందమర్రి

పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న పరీక్షలకు విద్యాశాఖ అధికారులు మండలంలో 5 పరీక్షా కేంద్రాలని ఏర్పాటు చేశారు. మందమర్రిలో 3, రామకృష్ణాపూర్‌లో 2 కేంద్రాలలో 913మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. ప్రారంభ పరీక్ష కావడంతో ఉదయం 8:30గంటలకే తల్లిదండ్రులు పిల్లల్ని తీసుకొని కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా సిబ్బంది తనిఖీ చేసి 9గంటలకు లోనికి పంపించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. సీఐ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మందమర్రి ఎస్ఐ ఎస్ రాజశేఖర్, రామకష్ణాపూర్ ఎస్ఐ జి రాజశేఖర్‌లు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని వెల్లడించారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన తహల్దాదర్

జన్నారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలను తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎస్ఐ రాజ వర్ధన్ ఎంఈఓ విజయ్ కుమార్లు తనిఖీ చేశారు. శుక్రవారం ప్రారంభమైన పదవ తరగతి పరీక్షకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలమని తెలిపారు. మొత్తం మండలంలో, మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొదటి రోజు 619 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కె చౌదరి నేతృత్వంలోని ఫ్లేయింగ్ స్క్వాడ్ బృందం సందర్శించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ వర్ధన్ తెలిపారు.

జైపూర్ : మండల కేంద్రంతో పాటు ఇందారంలో ఏర్పాటు చేసిన పరిక్షా కేంద్రాల్లో శుక్రవారం10వ తరగతి పరిక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరిక్షలు నిర్వహించారు. విద్యార్థులకు అనుగుణంగా ముందుగానే ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఇందారం పరిక్షా కేంద్రంలో 102 మంది విద్యార్థులు పరిక్షకు హాజరు కావల్సివుండగా 97 మంది విద్యార్థులు పరిక్షకు హాజరు కాగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

భీమారం మండల కేంద్రంలో...

భీమారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ గోపాల్ రావు తెలిపారు. ఈ పరిక్షా కేంద్రంలో 131 మంది విద్యార్థులు పరిక్షలకు హాజరు అయ్యారని పేర్కొన్నారు. పది పరిక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీస్ ఎస్ఐ శ్వేత పరిక్షా కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించగా శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పరిక్షా కేంద్రాలను సంధర్శించి బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు.



జన్నారంలో..

డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, మండలంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర నాయకులు మనీష్ మాట్లాడుతూ మండల కేంద్రంలో డిగ్రీ పరీక్ష కేంద్రం లేకపోవడంతో చాలామంది విద్యార్థులు డ్రాప్ అవుట్ అవుతున్నారన్నారు. డిగ్రీ పరీక్షా కేంద్రం లక్షెట్టిపేటలో ఉండడంతో విద్యార్థులకు దూర భారం పెరుగుతుందన్నారు. బస్సులలో వెళ్లాలంటే తీవ్రమైన రద్దీ నెలకొంది అన్నారు. దీంతో చాలామంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారన్నారు. జన్నారం పరిసర ప్రాంత గ్రామాల్లో అధికంగా పేద విద్యార్థులే ఉండడంతో, పరీక్షల సమయంలో అంత దూరం వెళ్లలేక పోతున్నామన్నారు. కార్యక్రమంలో డిగ్రీ విద్యార్థులు గట్టు వైష్ణవి, షహనా, అంజని, నవత, ఆర్య, అఖిల, ప్రత్యూష, సంఘవి, కావ్యంజలి, హారిక, పద్మ పాల్గొన్నారు.

నాణ్యమైన పనిముట్లను సరఫరా చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

నాసిరకమైన పనిముట్లను సరఫరా చేయకుండా నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, మస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా అన్నారు. శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఆర్పీ-1 గనిని సందర్శించి అన్ని డిపార్ట్మెంట్ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భగనుల్లో నాసిరకమైన వస్తువులను సరఫరా చేస్తున్నారని, కార్మికులకు అతి ముఖ్యమైన షూ కూడా నాసిరకంగా వస్తున్నాయని, యాజమాన్యం సరఫరా చేసిన షూలు కనీసం రెండు నెలలు కూడా రావడం లేదన్నారు. నాసిరకమైన హ్యాండ్ గ్లౌజులు ఇస్తున్నారన్నారని, లైన్మెన్ కార్మికులకు కీలలు సరిపడా సరఫరా చేయడం లేదని నాసిరకమైన పనిముట్లు సరఫరా చేస్తున్నారన్నారు. వెంటనే యాజమాన్యం నాణ్యమైన మెటీరియల్ సరఫరా చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్మికులు తెలిపిన పలు సమస్యలను గని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, బద్రి బుచ్చయ్య కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య, పరశురాములు, రాజ్ కుమార్, ఆడెపు సురేష్ పాల్గొన్నారు.

అచలాపూర్ చెరువు తూము ధ్వంసం

నవతెలంగాణ-తాండూర్


అచలాపూర్ చెరువు తూము కాలువ గోడలను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. తూము నుంచి పొలాలకు నీళ్ల పారే పిట్టగోడలను ట్రాక్టర్ల రాకపోకలకు అనువుగా రాళ్లను తొలగించి ధ్వంసం చేశారు. ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెరువులపై పర్యవేక్షణ కరువైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

పంట మార్పిడిపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-మందమర్రి

పంట మార్పిడిపై ఏడీఏ బానోత్ ప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. మామిడిగట్టు గ్రామం దుర్గం లింగయ్య మామిడి తోటలో శుక్రవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్ పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. పంట మార్పిడి ప్రయోజనాలు, పప్పు ధాన్యాల సాగుపై అవగాహన కలిపించి, ఆయిల్ పామ్‌తో పంట మార్పిడి చేసినప్పుడు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ సబ్సిడీ, మద్దతు ధర గురించి వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం, పంటల నమోదు, వరి ఇతర పంటలపై వచ్చు చీడపీడలు వాటి నివారణ చర్యలుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జి కిరణ్మయి, ఉద్యాన అధికారి కల్యాణి, విస్తరణ అధికారి ముత్యం, తిరుపతి, అజయ్, తాజా మాజీ సర్పంచ్ కోట రాయలింగు, ఉప సర్పంచ్ సత్తయ్య రైతులు గజ్జె రాజేష్, శంకరయ్య లక్ష్మణ్, పోశం పాల్గొన్నారు.

తాగు నీటి సరఫరాపై నిర్లక్ష్యం తగదు



నవతెలంగాణ-జన్నారం

గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పారిశుద్ధ్యపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని, దేవుని గూడా, జన్నారం గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయితీలో నిర్వహిస్తున్న ఏడు స్టార్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డ్ పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించారు. గ్రామాల్లో 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్ దేవుని గూడా కార్యదర్శి సరిత, జన్నారం కార్యదర్శి శ్రీపాల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | మార్చి 22, 2025 | www.navatelangana.com

ఖానాపూర్‌లో ఉచిత మెడికల్ క్యాంప్

నవతెలంగాణ-ఖానాపూర్

ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఫారెస్ట్ డివిజన్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అటవీ రేంజ్ అధికారి కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా



పాల్గొని మాట్లాడారు. సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే విధులు సక్రమంగా నిర్వహిస్తామని, ఆరోగ్యం కాపాడుకోవడం ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఉండాలన్నారు. ఇందులో స్థానిక మెడికేర్ ఆస్పత్రి డాక్టర్ సాయికిరణ్ రెడ్డి, కార్డియాలజిస్ట్ జగన్నాథం, దంత వైద్యులు సాయికిరణ్ సాదుల, ఫిజియోథెరపిస్ట్ నాగరాజు, మిషన్ ఐ కేర్ ఆప్టికల్ కంటి వైద్యులు చిత్రలత రెడ్డిమల్ల పాల్గొన్నారు.

గోండ్వాన దర్బార్ కరపత్రాల విడుదల

నవతెలంగాణ-ఉట్నూర్

ఈనెల 28న మండలంలోని మత్తడిగూడలో నిర్వహించే గోండ్వాన దర్బార్‌కు కోయ, పున్నెం, గోండ్వాన పేన్ పటేల్, కటోడాల్, దేవారిలు హజరు కావాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం దీనికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఆదివాసులు తమ గ్రామ దేవతలు, వంశదేవతలు, కుటుంబ దేవతల పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ మాజీ చైర్మెన్ భీంరావు, రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పెందోర్ ప్రభాకర్, మంగం విషంరావు, రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గెడం నిరంజన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మడవి బాలాజి ఉట్నూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పాల్గొన్నారు.



లోతోర్రైతండాలో ప్రపంచ అటవీ దినోత్సవం



నవతెలంగాణ-పెంబి

అడవులు పచ్చగా ఉంటేనే మన అందరి జీవితాలు ఆనందమయంగా ఉంటాయని, ప్రతి ఒక వ్యక్తి అడవుల సంరక్షణను తమ బాధ్యతగా భావించాలని ఇటిక్యాల డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రతాప్ తెలిపారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం మండలంలోని లోతోర్రైతండాలో వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో సంయుక్తకంగా ఆగ్రో ఫారెస్ట్రీ మొక్కల పెంపకం పై రైతులకు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆగ్రో ఫారెస్ట్రీ మొక్కల పెంపకానికి ఉపాధి హామీ శాఖ ద్వారా రైతులకు లభిస్తున్న ఆర్థిక ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని మండలంలో ఆగ్రో ఫారెస్ట్రీ మొక్కల సాగు విస్తీర్ణం పెంచాలని రైతులను కోరారు. ఇందులో మండలంలో నీలగిరి మొక్కల సాగును విస్తీర్ణం గణనీయంగా పెంచడంలో విశేషంగా కషి చేసిన ఆదర్శ రైతులు గుగ్లావత్ రెడ్డి, బానావత్ గణేష్ లను అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమం లో సిర్పూర్ పేపర్ మిల్లు ప్లాంటేషన్ అధికారి శ్రీధర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సుందర్, సుధాకర్, బీట్ ఆఫీసర్లు స్రవంతి, కిరణ్, గంగారాం, ఆశిష్, శ్రీనివాస్ మరియు రైతులు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాట ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైంది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రణదీవెనగర్‌లో ఎమ్మార్పీఎస్ మొదటి తరం నాయకులు, పుల్లూరి రాజన్న, జిల్లా కార్యదర్శి గడచంద మోహన్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ, మాదిగ అమరవీరులకు నివాళులర్పించి టపాసులు కాలుస్తూ సంబరాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతిమంగా రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఇందులో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఆరేపల్లి గణేష్, ఎమ్మార్పీఎస్ టౌన్ ప్రెసిడెంట్ మడిపల్లి మనోజ్, రూరల్ మండలం ఇన్‌చార్జి తరుడి శంకర్, జువ్వక చిన్నయ్య రమేష్, కిష్టన్న, అశోక్, పొచ్చన్న, ఉమేష్, మహిళలు, సావిత్రి, గంగుబాయి, రాంబాయి, రాజేశ్వర్, అశోక్, రవి, గణేష్, సాగర్ పాల్గొన్నారు.

అడవులు సంరక్షణ అందరి బాధ్యత



నవతెలంగాణ-సారంగాపూర్

అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అటవీ అధికారులు సప్న, వెన్నెల, సుజాత అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని స్వర్ణ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు, ఆడేల్లి గ్రామ ఉపాధి హామీ కూలీలకు అడవులు వాటి ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. మానవాళి మనుగడకు అడవులు జీవనాధారమన్నారు. ఇందులో హెచ్‌ఎం సంగీతరాణి, వార్డెన్ రాథోడ్ మంగేలాల్, విద్యార్థులు, ఉపాధి, అటవీ సిబ్బంది కూలీలు పాల్గొన్నారు.

బ్రిడ్జికి పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండలంలోని తోషం గ్రామం నుంచి తెలంగ్‌రావు గూడ వెళ్లే రోడ్డు బ్రిడ్జి కుంగి, సిమెంట్ దిబ్బలు పడుతూ అతి ప్రమాదకరంగా మారింది. ప్రతి రోజు తెలంగ్‌రావు గూడ గ్రామస్తులు నిత్యావసరాల సరుకుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు వెళ్లేటప్పుడు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ఆదివాసి సేన జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్ పట్టణంలో సోంజీ వార్డెన్ జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ ప్రవీణ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం కేశవ్ రావ్, సామాజిక కార్యకర్త ఉన్నారు.

మాకు అవకాశం కల్పించండి: ఏనుగు రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-జైనథ్

రాజీవ్ యువ వికాసంలో మాకు అవకాశం కల్పించండని రెడ్డి సంక్షమ సంఘ నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఈడబ్ల్యూఎస్ కలిగి ఉన్న రెడ్డి నిరుద్యోగ యువతను చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులో సంఘం నాయకులు రాంరెడ్డి, సూర్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదవ తరగతి పరీక్ష

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. నిమిషం నిబంధన ఎత్తివేయడంతో ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను సైతం పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. జిల్లాలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు ప్రథమ భాష పరీక్షకు 9122 మందికి గాను 9115 మంది హాజరు కాగా 7 గురు గైర్హాజరయ్యారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ డా. జానకి షర్మిల, డీఈవో రామారావు జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నాం

- సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శుల ముందస్తు అరెస్ట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసంఘటిత కార్మికులకు వెల్ఫేర్ బోర్డు, ఉద్యోగ భద్రత పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరితే అక్రమాలు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ పేర్కొన్నారు. సీఐటీయు ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులైన బీడీ, బిల్డింగ్, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలపై హైదరాబాద్ ఇందిరపార్క్ వద్ద సీఐటీయు ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ ధర్నాకు వెళ్లకుండా గురువారం రాత్రి బొజ్జ ఆశన్నను అరెస్ట్ చేసి జైనథ్ పీఎస్‌కు తరలించారు. అలాగే కార్యదర్శి అన్నమొల్ల కిరణ్‌ను శుక్రవారం తెల్లవారుజామున అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదన్నారు. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. అసంఘటిత కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తన విధానాలు మార్చుకోవాలని, బీడీ, బిల్డింగ్, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు, ఉద్యోగ భద్రత పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

నిర్మల్‌టౌన్ : పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడం సిగ్గు చేటని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగర్ వెంకటేష్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర నాయకులు చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించ తలపెట్టగా వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం హేయనీయమన్నారు. విద్యారంగానికి అతి తక్కువగా 7.57% మాత్రమే కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడిని భగ్నం చేయడానికి, విద్యార్థి గొంతులను నొక్కే ప్రయత్నంలో భాగంగానే పోలీసులు అక్రమంగా అరెస్టులకు పునుకున్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటి వరకు కనీసం విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం ఇందుకు నిదర్శనం అన్నారు. పెండిగ్ బిల్లులు, స్కాలర్‌షిప్‌లు, ఇతరతలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు వినికిడి పరికరాల పంపిణీ

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ ఆశ్రమ వికాసం ప్రత్యేక పాఠశాల కేబీ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఉట్నూర్‌లో ఆశ్రయ్ ఆకృతి హైదరాబాద్ వారి సౌజన్యంతో గిరిజన విద్యార్థిని విద్యార్థులకు వినికిడి పరికరాలు ఉచిత పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా పాల్గొని, సుమారు రూ.10లక్షలు విలువ గల వినికిడి పరికరాలు విద్యార్థులు, విద్యార్థినులకు అందించారు. అనంతరం కేబీ కాంప్లెక్స్ లోని సమావేశ మందిరంలో గాదిగూడ, నార్నూర్, ఉట్నూర్, మండలాల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలపై ప్రాజెక్ట్ అధికారి సమీక్ష నిర్వహించి, గిరిజన గ్రామాల్లో తాగునీటి నిర్వహణ విధులను నిర్వహించాలని పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. ఇంటింటికీ నీళ్లను అందించే బాధ్యతను వాళ్లకే ఇవ్వాలని తెలిపారు. అధికారులే తాగునీటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని అన్నారు. గ్రామాల వరకు రక్షిత మంచి నీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగమే తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని హ్యాబిటేషన్ గ్రామాలలో తాగునీరు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు, ఆవాసాలపై సమగ్రంగా సర్వే చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకోరావాలని అలాగే నీరు లేని గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా



చేయాలనీ అన్నారు, క్లోరినేషన్ జరిగే విధంగా చూడాలని ఎంపీఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీవీటీజీ ఏపీఓ మనోహర్, ఏఓ రఘు, ఏటీడీఓ క్రాంతి కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, ఆశ్రయ్ ఆకృతి నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీసీఐ సాధన సమితి దీక్షలు

- మూడో రోజుకు దీక్షలో మహిళలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీసీఐ పునరుద్ధరణ కోసం పార్టీలకు అతీతంగా చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. స్థానిక కలెక్టరేట్ ఎదుట ఈ దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరుకోగా మహిళలు పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీకి ఏ మాత్రమూ చిత్తశుద్ధి ఉన్నా ఈ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రితో వెంటనే అనుకూల ప్రకటన చేయించాలని డిమాండ్ చేస్తూ సీసీఐ సాధన కమిటీ సభ్యులు కోరారు. అలాగే సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంతో పాటుగా యంత్రాలను తుక్కు కింద విక్రయించే టెండర్ ప్రక్రియను వెనక్కి తీసుకోవాలన్నారు. అప్పటివరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీక్షలో కుర్మే స్వరూప, కస్తాల ప్రేమల, మంజుల, లంక జమున, కరుణ, సురేఖ, ఫర్వీన్, పొచ్చక్క, రేణుక, ముత్తు బాయి, వనిత, లక్ష్మి, మీన, టెకం మీన, సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్, కోకన్వీనర్స్ విజ్జగిరి నారాయణ, బొల్లు ఈశ్వర్ పాల్గొన్నారు.

రావి శ్రీనివాస్ నోరు అదుపులో పెట్టుకో



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక అయిన సీతక్కపై అవాకులు చెవాకులు పేలితే ఊరుకోబోమని, రావి శ్రీనివాస్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ షెడ్మకి ఆనంద్‌రావు హెచ్చరించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ బిడ్డ, మంత్రి సీతక్కపై సిర్పూర్ కాగజ్‌నగర్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అరక శేషురావు, జిల్లా కమిటీ సభ్యులు మెస్రం భాస్కర్, కుమ్ర ఉద్ధవ్, కుమ్ర సుంగు, కొట్నాక్ భరత్, సిడాం ఉత్తమ్ పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లో రాణించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువత రాజకీయాల్లో రాణించాలనే ఉద్దేశంతో చట్టాలు, ఇతర వాటిపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఎన్‌వైకె అధికారి సుశీల్ భడ్ అన్నారు. పట్టణ శివారులోని నలంద కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వన్ నేషన వన్ ఎలక్షన్ వికసిత్ భారత్‌పై రెండు రోజుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఇందులో మూడు జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొని వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై ప్రసంగాలు ఇచ్చారు. ప్రతిభ కనబర్చిన పదిమంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సుశీల్ భడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల విధానంలో మార్పులు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. యువతకు దీనిపై ముందుగా అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై రెండు రోజుల ప్రసంగ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. మూడు జిల్లాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో వచ్చారన్నారు. ఇక్కడ ఎంపికైన వారు రాష్ట్ర అసెంబ్లీలో దీనిపై ప్రసంగిస్తారని తెలిపారు. అక్కడ ప్రతిభ కనబర్చిన వారికి జాతీయ స్థాయిలో ప్రసంగం కల్పించే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పున్నరావ్, వైస్ ప్రిన్సిపాల్ విజయ్, గోపాల్, విశ్రాంత అధ్యాపకులు విజయబాబు పాల్గొన్నారు.

పంట దిగుబడి రాలేదని రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి లింగన్న (48) పంట దిగుబడి రాలేదని శుక్రవారం చేనులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం మతుడు లింగన్న తనకున్న 4 ఎకరాల్లో పత్తి, అంతర పంటగా కంది సాగుచేశాడు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటల దిగుబడి ఆశించినంరాక దానికి తోడు గిట్టు బాటు ధరలు లభించలేదు. దీంతో ఈ విషయమై తనలో తానే మదనపడేవాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగా ఉదయం ఎడ్ల బండి తోలుకొని చేనుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యుల చేనులోకి వెళ్లి చూడగా చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. అప్పటికే అతను మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

మెరిట్ లిస్ట్ విడుదల

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాల భర్తీ కొరకు గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ నెంబర్ 02/2024 స్టాఫ్ నర్స్, డిపిఓ, ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగాలకు సంబంధించిన మెరిట్ లిస్ట్, రిజెక్టెడ్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నిర్మల్.తెలంగాణ.గావ్.ఇన్ పోర్టల్‌లో ఉంచడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

సర్టిఫికేట్ కోర్సును సద్వినియోగం చేసుకోండి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 30 రోజుల సర్టిఫికేట్ కోర్సును అందిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డా.గంగాధర్ తెలిపారు. కోర్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆంగ్ల విభాగాధిపతి సుభాష్, అధ్యాపకులు డా. రజిత, రమేశ్ రెడ్డి, సూర్య సాగర్, అర్చన, శ్రీవారి, ఉమేశ్, తదితరులు పాల్గొన్నారు.



అడవిని కాపాడుదాం పర్యావరణాన్ని రక్షిద్దాం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అడవిని కాపాడుదాం పర్యావరణాన్ని రక్షిద్దామని స్థానిక ఎఫ్‌ఆర్‌ఓ సంతోష్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపదను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అడవిని రక్షించడం వల్ల భవిష్యత్తులో కరువు కాటకాలు రాకుండా ఉంటాయని, సమయానికి వర్షాలుపడి పాడి పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ..

స్థానిక విద్యార్థుకు ధనోరా(బి) అటవీ బీట్ అధికారిని రాథోడ్ జ్యోతి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల శంకర్ గూడ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చరక్ సుధీర్, సెక్షన్ అధికారి.చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుతో సోదరభావం పెంపొందుతుంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇఫ్తార్ విందుతో సోదరభావం పెంపొందుతుందని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పుట్లీబౌలిలో అమన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులకు ఖార్జుర పండ్లు తినిపించి రోజా ఉపవాసన్ని విడిపించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ ఉపవాసాలు పాటించాలని కోరారు. ఇందులో మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి అట్ల గోవర్ధన్ రెడ్డి, సమ్ము, ఖయ్యుమ్ ఖాజా, ఇర్ఫాన్, మైనార్టీ నేతలు ఉన్నారు.

తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఉపన్యాసం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత ఉపన్యాసం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై ప్రసంగించారు. తెలుగు సాహిత్యం అధ్యయనం చేస్తే వ్యక్తిత్వం మార్పు చెంది మనిషి మానవీయ విలువలు కలిగిన మనీషిగా రూపొందుతాడని పేర్కొన్నారు. అనంతరం ఆమెను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కెప్టెన్ జగ్రామ్ అంతర్వేది, తెలుగు అధ్యాపకులు రడావు సంతోష్ కుమార్, ఆనంద్, నందకుమార్, మంజుల, శ్రావణి, జోత్స్న, విద్యార్థులు పాల్గొన్నారు.

డిపో మేనేజర్‌గా పండరి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా శుక్రవారం పండరి బాధ్యతలను స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ డిపో మేనేజర్‌గా పనిచేసిన ప్రతిమారెడ్డి ఆదిలాబాద్ డిపోకు బదిలీపై వెళ్లారు. పండరి హైదరాబాద్‌లోని మియాపూర్ 2 డిపోలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేసి పదోన్నతిపై నిర్మల్ డిపో మేనేజర్‌గా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఆర్టీసీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

నేటి నుంచి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు శనివారం నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణిత బోధనలో, ఆంగ్ల బోధనా శాస్త్రంలో, కంప్యూటర్ విద్య, ఫౌండేషన్‌లో ఒక్కోటి చొప్పున ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎంఎస్‌సీ, ఎంఏ, బీటెక్ చేసి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. తెలుగు మాధ్యమం కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థి తెలుగు, ఇంగ్లీష్ మీడియం బోధించగలగాలని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ బయోడేటా, ఫోటోలతో ఈ నెల 22 నుంచి 24 లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.. అభ్యర్థులను నమూనా తరగతుల ఆధారంగా ఎంపిక చేస్తామని వెల్లడించారు.

బాలికకు అబార్షన్ పిల్స్.. క్లినిక్ సీజ్..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్‌లో క్లినిక్ నడిపిస్తున్న ఓ ఆర్‌ఎంపీ తన పరిధికి మించి గర్భం దాల్చిన బాలికకు అబార్షన్ పిల్స్ ఇచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్యారోగ్య శాఖధికారి డా. నరేందర్ రాథోడ్ సదరు క్లినిక్‌ను సీజ్ చేయమని శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. జిల్లాలో ప్రాక్టీసు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు కేవలం 'ఫస్ట్ ఎయిడ్' చికిత్స మాత్రమే చేయాలని పరిధికి మించి వైద్యం అందిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం జిల్లాలోని ప్రతి ప్రాక్టీషనరు జిల్లా వైద్యారోగ్య కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేనిపక్షంలో ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేస్తామన్నారు. అలాగే ప్రయివేటు ల్యాబ్‌లు నిర్వహిస్తున్న యజమానులు తమ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని లేనిపక్షంలో సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి జోగు రామన్నకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 27న ఆర్య వైశ్య జిల్లా మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా సంఘం నాయకులు మాజీ మంత్రి జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి నార్నూర్‌లో నిర్వహించే వేడుకకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రిక అందజేశారు. ముందుగా రామన్నకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా నూతన అధ్యక్షులు చింతావార్ రాజేశ్వర్, ప్రతినిధులు జనగం దినకర్, మల్లుర్వార్ చంద్రకాంత్, రాజేష్, క్రాంతి పాల్గొన్నారు.